సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం | 31 | ఆగస్టు | 2025



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు శనివారం సోమిశెట్టి సందీప్, కుటుంబ సభ్యులు (సఖినేటిపల్లి) రూ.50,116 విరాళం అందజేశారు.



పచ్చదనానికి పురస్కారం

పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా వాటికి నగదు పురస్కారాలను అందజేయనుంది.

8లో

నన్ను క్షమించండి..



మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన అతడు కష్టపడి ఉన్నత చదువులు చదివాడు. అధ్యాపకుడిగా జీవితంలో స్థిరపడ్డాడు. అయితే కుటుంబ కలహాలు, కూటమి నేతల ఒత్తిడి మేరకు పోలీసుల చేసిన కౌన్సెలింగ్‌తో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

అమలాపురం రూరల్: జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో విద్యుత్ బిల్లుల చెల్లింపులు ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ జరుగుతాయని ఏపీఈపీడీసీఎల్ జిల్లా ఎస్‌ఈ బి.రాజేశ్వరి తెలిపారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలతో పాటు ఏపీఈపీడీసీఎల్ సెక్షన్ ఆఫీస్ కౌంటర్లు, ఏటీపీ సెంటర్లలో ఆదివారం బిల్లులు చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

విద్యా సంస్కరణలపై శిక్షణ

అమలాపురం టౌన్: ఇంటర్ విద్యలో ఇటీవల చేపడుతున్న సంస్కరణలపై స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల గణిత అధ్యాపకులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను శనివారం నిర్వహించినట్లు డీఐఈఓ వనుము సోమశేఖరరావు తెలిపారు. కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు బీవైఎస్‌పీ ప్రసాద్ గణిత పాఠ్యాంశాలపై నూతన సిలబస్, మార్పులు, పరీక్ష విధానం, పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని డీఐఈఓ పరిశీలించి అధ్యాపకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ శిక్షణతో విద్యార్థులకు బోధనాపరంగా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లలో నాణ్యత దూరం

అమలాపురం టౌన్: ఈ ఏడాది జూన్ నెలలో పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లలో నాణ్యత లేక రెండు నెలలకే పాడైపోయాయని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దీపాటి సురేష్‌బాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు అమలాపురంలో శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థి కిట్లలో నాణ్యత లోపించడం వల్లే ఈ పరిస్థితి ఎదురైందని పేర్కొన్నారు. స్కూల్ బ్యాగ్‌లను పాఠశాలల స్టాక్ పాయింట్ల నుంచి తీసుకునే సమయానికే కొన్ని పాడైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పాడైన స్కూల్ బ్యాగ్‌ల స్థానే కొత్త బ్యాగ్‌లు సంబంధిత కాంట్రాక్టర్ ఇచ్చేలా ప్రభుత్వం చూడాలని సురేష్‌బాబు డిమాండ్ చేశారు.

స్వామి రూపం.. చూచిన కనులదే భాగ్యం



అప్పనపల్లి బాలాజీ స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: ఆ అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామిని చూసిన ప్రతి మదీ మురిసింది.. తన్మయత్వంతో మునిగి తేలింది. శనివారం స్వామివారి ఆలయానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. కొత్త, పాత గుడి వద్ద రద్దీ నెలకొంది. తొలుత భక్తులు పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. తలనీలాలు సమర్పించారు. ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. స్వామివారి సన్నిధిలో నిత్యం నిర్వహించే శ్రీలక్ష్మీ నారాయణ హోమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. సుప్రభాత సేవను ఆలయ అర్చకులు ఘనంగా జరిపించారు. తదుపరి ప్రాతఃకాలంలో తొలి హారతిని దర్శించుకునేందుకు విశేష సంఖ్యలో భక్తులు వచ్చారు. ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.2,38,498 ఆదాయం వచ్చింది. నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.72,224 విరాళాలుగా అందించారు. 3,800 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, రెండు వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఈ ఏర్పాట్లను ఆలయ ఈఓ వి.సత్యనారాయణ పర్యవేక్షించారు.

అన్ని రంగాల్లో అభివృద్ధికి చర్యలు

అమలాపురం రూరల్: జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. శనివారం అమలాపురం కలెక్టరేట్‌లో పాత్రికేయుల సమావేశం నిర్వహించి, గత ఏడాది పాలనలో చేపట్టిన పలు అభివృద్ధి అంశాలను వివరించారు. తొమ్మిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారి 216 సమస్యలను కేవలం నాలుగు నెలల్లో పరిష్కరించామని, సెప్టెంబర్ నెలాఖరుకు రోడ్డు ప్యాచ్ వర్క్‌లు పూర్తయి రాకపోకలకు అవకాశం ఏర్పడుతుందన్నారు. క్యాయర్ పరిశ్రమలు నెలకొల్పి క్యాయర్ మ్యాట్లు, మ్యాట్రిసెస్ తయారీకి ప్రోత్సహిస్తున్నామన్నారు. నాచు తయారీ ద్వారా తీర ప్రాంత డ్వాక్రా మహిళల తలసరి ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకున్నామన్నారు.

స్టాకు యార్డుల ద్వారా ఇసుక అందించాలి

జిల్లాలో నిర్మాణ రంగాలకు అవసరమైన ఇసుకను స్టాకు యార్డుల ద్వారా అందించాలని కలెక్టర్ మహేష్ కుమార్ ఆర్డీఓలు, భూగర్భ గనుల శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనుమతి లేని స్టాక్ పాయింట్ల వద్ద ఇసుకను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు.



అమలాపురంలో వినాయక మండపం వద్ద విద్యుత్ దీపాల అలంకరణ

ఉత్తుత్తి విద్యుత్

- జిల్లాలో మూడు వేలకు పైగా వినాయక మండపాలు
- ఉచిత విద్యుత్ ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- ఇప్పటి వరకూ 42 చోట్ల మాత్రమే వినియోగం
- నిబంధనలకు భయపడుతున్న నిర్వాహకులు

సాక్షి, అమలాపురం: ఏదైనా ప్రజా ప్రయోజన కార్యక్రమం అమలు చేయాలంటే ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉండాలి. అవేమీ లేకుండా కేవలం ప్రచార యావతో చేస్తే క్షేత్ర స్థాయిలో ఫలితాలు వేరే విధంగా ఉంటాయనడానికి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు.. అభివృద్ధి పేరుతో చేస్తున్న పనులు.. ప్రజాహిత కార్యక్రమాలే ఒక ఉదాహరణ. వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ ఇస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించడంతో కూటమి ప్రభుత్వం కూడా రాష్ట్రంలో వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పింది. తీరా అమలు చేసే సమయానికి ఆంక్షలు వర్తిస్తాయని షరతులు పెట్టింది.

జిల్లాలో వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతి కోరుతూ పోలీస్ శాఖకు ఆన్‌లైన్‌లో సుమారు 1,511 దరఖాస్తులు వచ్చాయి. అనుమతి లేకుండా రెండు, మూడు రెట్ల వినాయక మండపాలు ఏర్పాటు చేశారని అంచనా. ఆయా మండపాలను నిర్వాహకులు విద్యుత్ దీపాల అలంకరణలతో ముస్తాబు చేశారు. చాలా మండపాలకు స్థానికంగా ఉన్న గృహ సముదాయాలు, వ్యాపార, వాణిజ్య కేంద్రాల నుంచి విద్యుత్ తీసుకుంటున్నారు. గుళ్లు, గోపురాల వద్ద వాటికి ఉన్న సర్వీసుల నుంచి విద్యుత్ వాడుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని ప్రకటించింది. తీరా దీనిని అమలు చేసే సమయానికి ఆంక్షలు పెట్టింది.

ఇంకా ఎవరికీ తెలియక..

వినాయక చవితి ఈ నెల 27న మొదలైతే అంతకు ముందు రోజు రాత్రి మాత్రమే మండపాలకు ఉచిత ఉత్తర్వులు ఇచ్చింది. ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని చెప్పింది. ఉత్తర్వులు వచ్చిన విషయం మండపాల నిర్వాహకులకు ఇప్పటికీ తెలియదంటే అతిశయోక్తి కాదు. తెలిసిన వారు నిబంధనలకు భయపడి ముందుకు రావడం లేదు. ప్రధానంగా గ్రామీణ ప్రాంత వాసులకు దీనిపై పెద్దగా అవగాహన లేదు. ఈ కారణంగా ఇప్పటి వరకూ జిల్లాలో కేవలం 42 మండపాలకు మాత్రమే ఉచిత విద్యుత్ కల్పించారు. అమలాపురం పట్టణంలో సుమారు 75 వరకూ మండపాలు ఉండగా, శనివారానికి 12 పందిళ్లకు ఉచిత విద్యుత్ సౌకర్యం తీసుకున్నారు. ఇక మండపేట నియోజకవర్గం పరిధిలో 186 వరకూ మండపాలు ఉండగా, కేవలం 14 మాత్రమే ఉచిత సర్వీసుకు దరఖాస్తు చేసుకున్నారు. రామచంద్రపురం మున్సిపాలిటీ, ముమ్మిడివరం నగర పంచాయతీతో పాటు మిగిలిన ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది.

కొంతమంది మాత్రమే..



వినాయక చవితి ముందు రోజు రాత్రి ఉత్తర్వులు ఇచ్చారు. ఏఈలు, లైన్‌మెన్ల ద్వారా జిల్లాలో అన్ని గణపతి మండపాల కమిటీలకు ఉచిత విద్యుత్‌కోసం వివరించాం. అప్పటికే ఆలయాల నుంచి మండపాలకు విద్యుత్ తీసుకున్నారు. కొంత మంది మాత్రమే దరఖాస్తులు చేసుకుని వినియోగించుకున్నారు. దసరా వేడుకలకు ఎక్కువ మంది ఈ పథకాన్ని ఉపయోగించుకుంటారు.

– బి.రాజేశ్వరి, ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ

భార్ మంటూ..



- టెండర్లు వేసేందుకు వ్యాపారుల విముఖత
- జిల్లాలో 11 బార్లకు ఒకటే ఖరారు
- అదీ టీడీపీ అనుకూల సిండికేట్‌కే..
- టెండర్ ధరావతు తగ్గించేలా పన్నాగం

సాక్షి, అమలాపురం: మద్యం సిండికేట్ వ్యూహం ఫలించింది.. బార్ల లైసెన్స్ కోసం నిర్వహించిన టెండర్లకు విధించిన ధరావతును తగ్గించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కూటమి అనుకూల మద్యం సిండికేట్‌దారులు టెండర్ల డ్రామాను రక్తి కట్టించారు. జిల్లాలో మొత్తం 11 బార్లకు సంబంధించి శనివారం నిర్వహించిన టెండర్లలో కేవలం ఒకే ఒక బార్‌కు సంబంధించి మాత్రమే టెండరు ఖరారైంది. మిగిలిన వాటికి నిబంధనల మేరకు టెండర్లు పడకపోవడంతో వాటిని రద్దు చేశారు. జిల్లా పరిధిలో మొత్తం 11 బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో తొమ్మిది జనరల్ కాగా, రెండు కల్లు గీత కార్మికులకు కేటాయించింది. లైసెన్స్ ఫీజు రూ.20 లక్షలు కాగా, టెండర్‌కు ధరావతు రూ.5.10 లక్షల చొప్పున నిర్ణయించింది. ఒక్కో బార్‌కు కనీసం నాలుగురైనా దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంది. అప్పుడు ఆయా బార్లకు టెండర్లు తెరుస్తారు. నలుగురిలో ఒకరిని లాటరీ విధానంలో ఎంపిక చేస్తారు. అంటే సిండికేట్ మీద బార్ లైసెన్స్ పొందాలంటే కనిష్ఠంగా నాలుగు దరఖాస్తులకు రూ.20.40 లక్షల వరకూ అవుతోందని, ఒకరిపై లైసెన్స్ పొందితే మిగిలిన రూ.15.30 లక్షలు నష్టపోతామని సిండికేట్ వ్యాపారుల ఆలోచన. దీనిని సాకుగా చూపించి కూటమి అనుకూల మద్యం సిండికేట్‌దారులు టెండర్లు వేయకపోవడంతో పాటు టెండరు వేసేందుకు ముందుకు వచ్చిన వారిని అడ్డుకోవడం గమనార్హం. దీంతో జిల్లాలో 11 బార్లకుగాను కేవలం ఒకటంటే ఒక బార్‌కు మాత్రమే టెండరు ఖరారైంది. అది కూడా అమలాపురం పట్టణ పరిధిలోని బార్ కావడం, అదీ టీడీపీ అనుకూలదారులే కావడం విశేషం.

మామూళ్ల భారమూ ఎక్కువే?

మద్యం షాపులు.. బార్ల నిర్వాహకులకు మామూళ్లు తలకు మించిన భారంగా మారుతోంది. ఇటు నాయకులు, అటు అధికారులు టార్గెట్‌లు పెట్టి మరీ వసూలు చేస్తున్నారు. నాయకులు నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల చొప్పున మామూళ్లు వసూలు చేస్తున్నారు. మరోవైపు ఎక్సైజ్ అధికారులు సైతం షాపునకు వచ్చి రూ.30 వేల నుంచి రూ.50 వేల చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై గత నెలలో మద్యం సిండికేట్ ఒక రోజు దుకాణాలు మూసి నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఎక్సైజ్ కార్యాలయం వద్దకు వెళ్లి మద్యం దుకాణాల తాళాలు అధికారులకు ఇచ్చి వారిపై ఆరోపణలు గుప్పించారు. ఇది రాష్ట్ర స్థాయిలో సంచలనమైంది. ఇప్పుడు బార్ల లైసెన్స్‌కు మద్యం వ్యాపారులు దూరంగా ఉండటానికి ఈ మామూళ్లు కూడా ఒక కారణమని తెలుస్తోంది. ఏదేమైనా మొత్తం సిండికేట్‌గా సాగుతున్నారు.

వాయిదా పడితేనే..

బార్లకు నిర్వహించే టెండర్ల ప్రక్రియ ఒకటి రెండుసార్లు ఇలా వాయిదా పడితేకాని ప్రభుత్వం దారికి రాదనే అంచనాతో మద్యం వ్యాపారులు ఉన్నారు. ముమ్మిడివరం, అమలాపురంలో కూటమి పార్టీకి చెందిన కీలక ప్రజాప్రతినిధులు నేరుగా మద్యం వ్యాపారంలో భాగస్వాములుగా ఉండగా, మిగిలిన వారికి సిండికేట్‌తో ఒప్పందాలు ఉన్నాయి. వీరి అండతోనే మద్యం వ్యాపారులు ప్రభుత్వ విధానాలను కూడా కోనసీమ జిల్లా వరకూ తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఆ నమ్మకంతోనే బార్ల లైసెన్స్ అనుమతులకు టెండర్లు వేయకుండా ఉన్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



అమలాపురంలో ఎక్సైజ్ కార్యాలయం

ఎక్సైజ్ సూపరింటెండెంట్ బదిలీ



ప్రసాద్, ఎక్సైజ్ సూపరింటెండెంట్

అమలాపురం టౌన్: జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌డీవీ ప్రసాద్ ఆకస్మికంగా బదిలీ అయ్యారు. విజయవాడ ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయానికి రిపోర్టు చేయాలని ఆయనకు శనివారం సాయంత్రం ఆదేశాలు వచ్చాయి. జిల్లాలో శుక్రవారం జరిగిన 11 బార్లకు దరఖాస్తుల విషయంలో చోటుచేసుకున్న వైఫల్య ప్రభావం ఆయనపై పడినట్లు తెలుస్తోంది. జిల్లాకు మంజూరైన 11 బార్లకు సంబంధించి అమలాపురంలో ఒకే ఒక బార్‌కు 4 దరఖాస్తులు వేయడం మినహా మిగిలిన 10 బార్లకు దరఖాస్తులు రాని విషయం విదితమే. ఏడాది కిందటే అమలాపురంలోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు.

ముగిసిన ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలు



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పురుషుల విభాగం విజేత దుర్గా శివకుమార్, మహిళల విభాగంలో విజేత అఖిలదేవిలకు బహుమతుల ప్రదానం

అమలాపురం టౌన్: స్థానిక ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ ప్రాంగణంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ప్రారంభమైన ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలు ముగిశాయి. ఇందులో విజేతలను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పప్పుల శ్రీరామచంద్రమూర్తి, కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు ప్రకటించారు. పోటీల్లో స్ట్రాంగ్ మన్ విన్నర్‌గా కె.దుర్గా శివకుమార్ (కాకినాడ), రన్నర్‌గా కె.మోహన్ (కాకినాడ), స్ట్రాంగ్ వుమన్ విన్నర్‌గా డి.అఖిలదేవి (రామచంద్రపురం), రన్నర్‌గా వై.ఇందిర (అమలాపురం), స్ట్రాంగ్ మాస్టర్ విన్నర్‌గా డి.నాగేశ్వరరావు (ద్రాక్షారామ), స్ట్రాంగ్ మాస్టర్ రన్నర్‌గా బి.అప్పన్న (అమలాపురం) టైటిల్స్‌ను గెలుచుకున్నారు. అలాగే వుమన్ విభాగంలో 66 కేజీల కేటగిరీలో ఎస్.స్పందన (రాజోలు), 74 కేజీల కేటగిరీలో పి.దీవెన (కాకినాడ), 83 కేజీలో కేటగిరీలో డి.అఖిలదేవి (రామచంద్రపురం), బాలుర సబ్ జూనియర్ విభాగంలో 53 కేజీల కేటగిరీలో పి.వీరేంద్ర (కాకినాడ), 59 కేజీల కేటగిరీలో జె.జితేంద్రదొర (అమలాపురం), 66 కేజీల కేటగిరీలో కె.సాయి మణికంఠ (కాకినాడ), 74 కేజీల కేటగిరీలో ఎంఎస్ విన్ (జగ్గంపేట), మన్ విభాగంలో 59 కేజీల కేటగిరీలో వై.రాజు (రాజమహేంద్రవరం), 66 కేజీల కేటగిరీలో ఎం.రాహుల్ బాబు (అమలాపురం), 74 కేజీల కేటగిరీలో కె.దుర్గా సాయికుమార్ (కాకినాడ), 83 కేజీల కేటగిరీలో కె.మోహన్ (కాకినాడ), 93 కేజీల కేటగిరీలో కె.సుధీర్ (మలికిపురం), 105 కేజీల కేటగిరీలో బి.అనూష్‌బాబు (మురమళ్ల), మాస్టర్స్ విభాగంలో 83 కేజీల కేటగిరీలో డి.నాగేశ్వరరావు (ద్రాక్షారామ), 93 కేజీల కేటగిరీలో బి.అప్పన్న (అమలాపురం) ప్రథమ స్థానాలు సాధించారు. విజేతలకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, అమలాపురం వైస్ ఎంపీపీ అడపా వెంకట సుబ్రహ్మణ్యం, బీజేపీ నాయకుడు మోకా వెంకట సుబ్బారావు, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు తదితరులు ట్రోఫీలు, నగదు బహుమతులు పంపిణీ చేశారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, నగభేరి కృష్ణమూర్తి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు కల్వకొలను బాబు, గొలకోటి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలకు దాదాపు 200 మంది పవర్ లిఫ్టర్లు పాల్గొని బరువులెత్తి సత్తా చాటారు.

భజే విఘ్నేశ్వరా..

అయినవిల్లి: గణపతి నవరాత్రుల్లో భాగంగా అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారికి శనివారం లక్ష దూర్వార్చన పూజ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాలు, శ్రీలక్ష్మీ గణపతి హోమం జరిపారు. స్వామివారికి పంచ హారతులు ఇచ్చారు. స్వామివారిని మూషిక వాహనంపై ఉంచి వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం గ్రామోత్సవం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏర్పాట్లను ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ అల్లు వెంకట దుర్గాభవాని పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారు

క్రమంగా పెరుగుతూ..



ముక్తేశ్వరం - అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వే వద్ద వరద నీటిలో వెళ్తున్న ప్రజలు



ఐ.పోలవరం మండలం మురమళ్ల - అన్నంపల్లి పాత, కొత్త అక్విడెక్టుల మధ్య వరద ఉధృతి

- మళ్లీ గోదావరికి వరద నీరు
- నీట మునిగిన కనకాయలంక కాజ్‌వే

ఐ.పోలవరం/ పి.గన్నవరం: వరద మళ్లీ పెరుగుతోంది.. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దిశగా గోదావరి పరవళ్లు తొక్కుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తెలంగాణ జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో వరద నీరు పెద్ద ఎత్తున దిగువకు వస్తోంది.

ధవళేశ్వరం బ్యారేజీ వద్ద శుక్రవారం ఉదయం పెరిగిన వరద తరువాత సాయంత్రం నుంచి తగ్గుముఖం పట్టింది. తిరిగి శనివారం ఉదయం నుంచి పెరుగుతూ వస్తోంది. తెల్లవారుజామున మూడు గంటల నుంచి వరద క్రమేపీ పెరుగుతోంది. మూడు గంటలకు బ్యారేజీ నుంచి దిగువకు 7,52,579 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇది ఉదయం ఆరు గంటల సమయానికి 7,93,608 క్యూసెక్కులకు, మధ్యాహ్నం 12 గంటలకు 8,60,262 క్యూసెక్కులకు, మూడు గంటలకు 8,98,113 క్యూసెక్కులకు, రాత్రి ఎనిమిది గంటలకు 9,75,286 క్యూసెక్కులకు చేరింది.

పడవలపైనే ప్రయాణం

జిల్లాలోని లంక గ్రామాలపై వరద ప్రభావం పడింది. పి.గన్నవరం మండల పరిధిలో జి.పెదపూడిలంక, ఊడిమూడిలంక, బూరుగులంక, అరిగెలవారిపేటలకు ఇప్పటికీ పడవలపై రాకపోకలు సాగుతున్న విషయం తెలిసిందే. తాజాగా వరద పెరగడంతో మండలాన్ని ఆనుకుని పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోకి వచ్చే కనకాయలంక కాజ్‌వే నీట మునిగింది. దీంతో ఇక్కడ పడవలపై రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అలాగే పెదమల్లంక, సిర్రావారిలంక, ఆనగారి లంకలకు సైతం పడవలపై వెళ్తున్నారు. మరోసారి వరద పెరగడంతో ఇక్కడ లంక రైతులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులకు ఇక్కట్లు మొదలయ్యాయి.

లోతట్టు ప్రాంతాలను తాకుతూ..

ఐ.పోలవరం మండలం అన్నంపల్లి అక్విడెక్ట్‌ను ఆనుకుని వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ మండలంలో మురమళ్ల, కేశనకుర్రు పంచాయతీ పరిధిలోని పొగాకులంక, పల్లిపాలెం, ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేల్లంక, గురజాపులంక, కూనాలంక, కాట్రేనికోన మండలం పల్లంకుర్రు రేవు, బలుసుతిప్ప, అల్లవరం మండలం బోడసకుర్రు పల్లిపాలెం వంటి లోతట్టు ప్రాంతాలను తాకుతూ వరద ప్రవహిస్తోంది. వరద మరింత పెరిగితే ఈ లంక గ్రామాల్లోకి వరద నీరు చేరే అవకాశముంది.

ప్రయాణం.. ప్రమాదం



ఐ.పోలవరం మండలం జి.మూలపాలెం రేవులో లైఫ్ జాకెట్లు లేకుండా పడవపై ప్రయాణం

వరద ఉధృతి పెరుగుతున్న సమయంలో జిల్లాలోని పలు రేవుల వద్ద లైఫ్ జాకెట్లు లేకుండా పడవలపై ప్రయాణాలు సాగిస్తుండడం గమనార్హం. ఐ.పోలవరం మండలం జి.మూలపాలెం రేవులో ఎటువంటి జాగ్రత్తలు పాటించడం లేదు. కనీసం లైఫ్ జాకెట్లు కూడా ఉపయోగించకుండా ప్రయాణికులను రేవు దాటిస్తున్నారు. వరదల సమయంలో రేవు ప్రయాణాలపై అధికారులు నిఘా పెట్టాల్సి ఉన్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు. ప్రమాదం జరిగితేకాని అధికారులు స్పందించరా అని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు.

5న ప్రభుత్వ ఉద్యోగుల సమావేశం

అమలాపురం టౌన్: జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు వచ్చే నెల 5న జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సమావేశాన్ని అమలాపురం పెన్షనర్ల కార్యాలయంలో నిర్వహిస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దాల బాపూజీ తెలిపారు. స్థానిక గొల్లగూడెంలో శనివారం జరిగిన జిల్లా సంఘం ఆఫీస్ బేరర్స్ సమావేశంలో బాపూజీ మాట్లాడారు. 'ఉద్యోగులారా...రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే కార్యక్రమాన్ని రాష్ట్ర సంఘం రూపొందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 5న జరిగే సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాశీబట్ల రామ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. సమావేశంలో జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి కె.మల్లిబాబు, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, సహాయ కార్యదర్శి వి.శివకుమార్, సంఘ నాయకులు పి.కామేశ్వరరావు, బి.సుగుణరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేదిలో రేపటి నుంచి పవిత్రోత్సవాలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సోమవారం నుంచి 4వ తేదీ వరకూ స్వామివారి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మోకా కేశవ తిరుమల నాగ వరప్రసాద్ శనివారం తెలిపారు. ప్రజలకు ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలగాలని, సర్వప్రాయశ్చిత్తార్థం పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ మాట్లాడుతూ 1న అంకురార్పణ, 2న అలంకార తిరుమంజనం, పవిత్రారోహణ, 3న ప్రాయశ్చిత హోమాలు, 4న మహాశాంతి హోమం, పూర్ణాహుతి, స్వామివారి గ్రామోత్సవం, రాత్రి పవిత్ర అవరోహణ, విశేష అర్చనలు ఉంటాయన్నారు.

క్లుప్తంగా

సుస్థిర లక్ష్యాల సాధనకు కృషి చేయాలి



పంచాయతీ కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఫ్యాకల్టీలు

సామర్లకోట: సుస్థిర లక్ష్యాల సాధనకు జిల్లా స్థాయి అధికారులు కృషి చేయాలని విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ) సీనియర్ ఫ్యాకల్టీలు కె.సునీల, ఎస్ఎస్ శర్మ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం(ఈటీసీ)లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల శిక్షణలో భాగంగా మూడు రోజుల పాటు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమ, ఏలూరు జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు టీఓటీలుగా నిర్వహించిన శిక్షణ శనివారంతో ముగిసింది. వారు మాట్లాడుతూ సుస్థిర లక్ష్యాలలో ముఖ్యమైన ఒకటి నుంచి ఎనిమిది అంశాలపై శిక్షణ ఇచ్చామని, వాటిని ఆయా గ్రామాల్లో అమలు జరిగే విధంగా చూడాలన్నారు. శిక్షణ పొందిన పంచాయతీ కార్యదర్శులు ఆయా జిల్లాలోని మండల పరిధిలో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఫ్యాకల్టీలు ఎం.చక్రపాణిరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

20 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యం లారీని సీజ్ చేసిన అధికారులు

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి తెనాలికి లారీలో తరలిస్తున్న 20 టన్నుల రేషన్ బియ్యాన్ని శనివారం కోరంగి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. యానాంలోని సర్వలక్ష్మి రైస్ ప్రొడక్షన్ మిల్లు నుంచి ఆంధ్రా ప్రాంతానికి బియ్యాన్ని తరలిస్తుండగా కోరంగి పోలీసులు, పౌర సరఫరాల శాఖ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రరావు, తాళ్లరేవు డిప్యూటీ తహసీల్దార్ టి.సూరిబాబు, కోరంగి అడిషనల్ ఎస్సై సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది బియ్యాన్ని పరిశీలించారు. అనంతరం బియ్యంతో పాటు లారీని సీజ్ చేశారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చదనానికి పురస్కారం

- పాఠశాలలకు స్టార్ రేటింగ్
- కేంద్ర ప్రభుత్వ కొత్త పథకం
- జిల్లా నుంచి 8 పాఠశాలలకు అవకాశం
- జాతీయస్థాయికి ఎంపికైతే రూ.లక్ష ప్రోత్సాహకం



ఉన్నత పాఠశాల

రాయవరం: మానవాళి మనుగడ సాగించేందుకు పచ్చదనం, పరిశుభ్రత అనేవి చాలా అవసరం. వీటిని ఎవరికి వారు కాపాడుకుంటూ భావితరాలకు అందజేయాలి. పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. మొక్కలను పెంచడం వల్ల స్వచ్ఛమైన గాలి లభిస్తుంది. అలాగే పరిశుభ్రత కారణంగా అనేక వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చు. ఈ నేపథ్యంలో ఈ రెండింటినీ పాఠశాల స్థాయి నుంచి అభివృద్ధి చేయాలని కేంద్ర విద్యాశాఖ నిర్ణయించింది. దీనిలో భాగంగా పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్య ఇచ్చే పాఠశాలలకు రేటింగ్ ఇవ్వనుంది. మెరుగైన పనితీరు కనబరిచిన పాఠశాలలకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తుంది.

ఐదు స్టార్ల కేటాయింపు

కేంద్ర ప్రభుత్వం గతంలో ఉన్న స్వచ్ఛ విద్యాలయ పురస్కార్‌లో మార్పులు చేసి ఇప్పుడు స్వచ్ఛ ఏవమ్ విద్యాలయ రేటింగ్ (ఎస్‌హెచ్‌వీఆర్) 2025–26 పేరిట బడులకు రేటింగ్ ఇవ్వనుంది. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా జాతీయ స్థాయికి ఎంపికైన పాఠశాలలకు స్వచ్ఛ విద్యాలయ పురస్కారంతో పాటు రూ.లక్ష ప్రోత్సాహకం అందించనుంది. మొత్తం ఆరు ప్రధాన కొలమానాలకు సంబంధించి 60 సూచికల ఆధారంగా ఒకటి నుంచి ఐదు స్టార్లు కేటాయించనున్నారు. ప్రతి జిల్లా నుంచి ఎనిమిది పాఠశాలలను ఈ పథకం కింద ఎంపిక చేస్తారు.

జిల్లాలో 2,031 పాఠశాలలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో వివిధ కేటగిరిలకు చెందిన 2,031 పాఠశాలలున్నాయి. 1 నుంచి 10వ తరగతి వరకు ఉన్న అన్ని పాఠశాలలు ఎస్‌హెచ్‌వీఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సెప్టెంబర్ 10వ తేదీ లోపు ఎస్‌హెచ్‌వీఆర్ పోర్టల్‌లో నమోదు చేయాలి. ప్రతి సూచికకు సంబంధించిన ఆధారాలు అప్‌లోడ్ చేయాలి. పరిశీలకులు స్వయంగా పరిశీలించి ఒకటి నుంచి ఐదు వరకు రేటింగ్ ఇస్తారు. ఉత్తమ స్కోర్ సాధించిన బడులకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు ఇస్తారు. ఒక్కో జిల్లా నుంచి 8 పాఠశాలలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో గరిష్ఠంగా 20 పాఠశాలలకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇస్తారు. వాటిని జాతీయ స్థాయికి పంపిస్తారు. జాతీయ స్థాయికి ఎంపికైన పాఠశాలలకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకం అందజేస్తారు. సంబంధిత హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లకు దేశంలోని ప్రముఖ సంస్థలను సందర్శించే అవకాశం కల్పిస్తారు.

ఆరు అంశాలు.. 60 సూచికలు

ఆరు అంశాల ఆధారంగా పాఠశాలలకు రేటింగ్ ఇస్తారు. పాఠశాలలో నీటి సదుపాయం, వాన నీటి సంరక్షణ, వినియోగం, మరుగుదొడ్డి సౌకర్యాలు, విద్యార్థులకు సబ్బుతో హ్యాండ్ వాష్, వ్యర్థాల నిర్వహణ, మొక్కల పెంపకం, ప్లాస్టిక్ వాడకం తగ్గించడం , విద్యుత్ సదుపాయం, బిహేవియర్ ఛేంజింగ్, కెపాసిటీ నిర్మాణం, మిషన్ లైఫ్ యాక్టివిటీస్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఫైవ్ స్టార్ రేటింగ్ ఇస్తారు.

ప్రతి పాఠశాల రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



ఎస్‌హెచ్‌వీఆర్ యాప్‌లో ప్రతి పాఠశాల రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. స్వచ్ఛ విద్యాలయ పురస్కార్‌కు ఆరు అంశాల ప్రాతిపదికగా దరఖాస్తు చేసుకోవాలి. స్వచ్ఛ విద్యాలయాలుగా తీర్చిదిద్దేందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలి.

– బీవీవీ సుబ్రహ్మణ్యం, సీఎంవో, సమగ్ర శిక్షా, అమలాపురం

అవగాహన కల్పించాం



స్వచ్ఛ ఏవమ్ విద్యాలయ రేటింగ్ (ఎస్‌హెచ్‌వీఆర్) 2025–26కు ప్రతి పాఠశాల అర్హత సాధించేందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలి. దీనిపై ఇప్పటికే ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించాం. మండల విద్యాశాఖాధికారులు తమ పరిధిలోని పాఠశాలలను పర్యవేక్షణ చేసి, ప్రతి పాఠశాల రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూడాలి.

– జి.మమ్మీ, అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్, సమగ్ర శిక్షా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

కళ్లలో కారం కొట్టి బంగారం గొలుసు చోరీ



సత్యనారాయణరాజు దంపతులు

ఐ.పోలవరం: ఇంట్లో టీవీ చూస్తున్న మహిళ కళ్లలో కారం కొట్టి, నాలుగు కాసుల బంగారం గొలుసును దొంగలు దోచుకుపోయారు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇవీ.. ఐ. పోలవరం మండలం కేశనకుర్రుపాలేనికి చెందిన గాదిరాజు సత్యనారాయణ రాజు, కృష్ణవేణి భార్యాభర్తలు. శుక్రవారం రాత్రి సత్యనారాయణరాజు గదిలో నిద్రిస్తుండగా, ఆయన భార్య కృష్ణవేణి హాల్లో టీవీ చూస్తున్నారు. ఆ సమయంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి.. కృష్ణవేణి కళ్లలో కారం కొట్టారు. ఆమె మెడలోని నాలుగు కాసుల బంగారం గొలుసును లాక్కుని పోయారు. ఆమె తేరుకుని కేకలు వేసేటప్పటికే మోటారు బైక్‌పై పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయానికి వెళ్లి వస్తుండగా..

పెద్దాపురం: స్వయంభూ తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయానికి కాలినడకన వస్తున్న మహిళను బెదిరించి, ఆమె మెడలోని నాలుగు కాసుల బంగారం గొలుసును దొంగ లాక్కుని పరారయ్యాడు. పెద్దాపురం మండలం చదలాడ–ఉలిమేశ్వరం గ్రామాల మధ్య శనివారం ఈ ఘటన జరిగింది. కాండ్రకోటకు చెందిన ఒబిలిశెట్టి అమ్మల అనే మహిళ వేకువజామున కాలి నడకన స్వామివారి గుడికి వస్తోంది. మార్గంమధ్యలో ఉలిమేశ్వరం – చదలాడ గ్రామాల మధ్యలో ఉన్న పామాయిల్ తోట వద్ద గుర్తు తెలియని యువకుడు ఆమెను బెదిరించి, బంగారం గొలుసు లాక్కుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మౌనిక తెలిపారు.

నన్ను క్షమించండి..

- వాట్సాప్‌లో స్టేటస్ పెట్టి జేఎన్‌టీయూకే అధ్యాపకుడి ఆత్మహత్య
- కుటుంబ కలహాలే కారణం
- భార్య, కూటమి నేతల ఒత్తిడి మేరకు పోలీసులు చేసిన కౌన్సెలింగ్‌తో మనస్తాపం




మట్ల శ్రీనివాస్ (ఫైల్)

తొండంగి: మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన అతడు కష్టపడి ఉన్నత చదువులు చదివాడు. అధ్యాపకుడిగా జీవితంలో స్థిరపడ్డాడు. అయితే కుటుంబ కలహాలు, కూటమి నేతల ఒత్తిడి మేరకు పోలీసుల చేసిన కౌన్సెలింగ్‌తో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. తొండంగి మండలం రావికంపాడుకు చెందిన మట్ల గంగారావు, గంగమ్మ దంపతుల కుమారుడు మట్ల శ్రీనివాస్ (35) జేఎన్‌టీయూకేలో కాంట్రాక్టు అధ్యాపకుడిగా 13 ఏళ్ల నుంచి పనిచేస్తున్నాడు. అతడికి సుమారు 12 ఏళ్ల క్రితం వివాహం కాగా, భార్య దివ్యతో కలిసి కాకినాడలో నివాసం ఉంటున్నాడు. వీరికి గంగ సాన్విత, సాయి గంగాధర అవినాష్ అనే పిల్లలు ఉన్నారు. కాగా.. కొంత కాలంగా శ్రీనివాస్‌కు అతడి భార్యతో మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఆమె తన బంధువులైన కూటమి నేతల ఒత్తిడితో నాలుగు రోజుల క్రితం అన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు శ్రీనివాస్‌ను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు.

మనస్తాపంతో..

ఈ ఘటనతో మనస్తాపం చెందిన శ్రీనివాస్ శుక్రవారం తన స్వగ్రామమైన రావికంపాడుకు వచ్చాడు. తల్లిదండ్రులతో మాట్లాడిన అనంతరం బయటకు వచ్చి స్థానిక రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముందుగా తన ఆత్మహత్యకు వీరే కారణమంటూ కొందరి పేర్లను ప్రస్తావించాడు. అలాగే నన్ను క్షమించండి అంటూ పిల్లల పేర్లు, అమ్మ నాన్న అని టైప్ చేసి వాట్సాప్‌లో స్టేటస్ పెట్టాడు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో సంచలనమైంది. కాగా.. రైల్వేట్రాక్‌పై శ్రీనివాస్ మృతదేహాన్ని శనివారం గుర్తించామని, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు తుని రైల్వే ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. మృతుడి తండ్రి గంగారావు వికలాంగుడు, తల్లి కీళ్ల వ్యాధితో నడవలేని స్థితిలో ఉంది. ఈ పరిస్థితిలో కుమారుడిని కోల్పోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



క్షమించండి అంటూ వాట్సాప్ స్టేటస్‌లో శ్రీనివాస్ పెట్టిన సందేశం

నీలపల్లి హత్య కేసులో నిందితుడికి రిమాండ్



నిందితుడు రాజును అరెస్ట్ చేసిన కోరంగి పోలీసులు

తాళ్లరేవు: నీలపల్లిలో జరిగిన హత్య కేసుకు సంబంధించి నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నీలపల్లి పంచాయతీ మురళీనగర్‌లోని సిమెంట్ దుకాణం ఎదురుగా ఆగస్టు 25వ తేదీ అర్ధరాత్రి సమయంలో హత్య జరిగింది. సెల్‌ఫోన్ విషయంలో వివాదం చెలరేగి, యానాం కాకివారి వీధికి చెందిన పాలెపు శ్రీనివాస్ హత్యకు గురయ్యాడు. అతడు స్నేహితుడైన యానాం కురసాంపేట గ్రామానికి చెందిన అంగాని రాజు ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఈ మేరకు నిందితుడిని కాకినాడ రూరల్ సీఐ డి.చైతన్య కృష్ణ, కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ స్టేషన్ రైటర్ ఎస్వీ రమణ అరెస్ట్ చేశారు. కాగా.. అంగాని రాజుకు సుమారు 20 ఏళ్ల క్రితం పశువుల్లంక గ్రామానికి చెందిన మరియమ్మతో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజుతో తగాదాపడి ఆమె ఇంటిలోనే కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై కాట్రేనికోన పోలీస్‌స్టేషన్‌లో రాజుపై కేసు నమోదైంది. అనంతరం మరో వివాహం చేసుకున్నాడు. 2021లో కొట్లాట కేసు, 2022లో బండి దగ్ధానికి సంబంధించి అతడిపై కేసులు ఉన్నాయి.

దొంగల ముఠా అరెస్ట్



ట్రక్కుల దొంగలను విలేకరులకు చూపుతున్న పోలీసులు

గండేపల్లి: ట్రాక్టర్ ట్రక్కులను చోరీ చేస్తున్న దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. ఆయన శనివారం ఆ వివరాలు వెల్లడించారు. ధవళేశ్వరం సమీపంలోని రాజవోలుకు చెందిన బి రత్నరాజు, కడియం మండలం జేగురుపాడుకు చెందిన ఎం శ్రీను, పి.తరుణ్, ఎం.వినయ్ కుమార్ ట్రాక్టర్ (ఇంజిన్)ను తీసుకుని వచ్చి రైతుల పొలాల వద్ద ఉంచిన ట్రక్కులను దొంగిలిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం తాళ్లూరులో ట్రక్కును చోరీ చేస్తుండగా ఎస్సై యూవీ శివ నాగబాబు తన సిబ్బందితో దాడి చేసి అరెస్ట్ చేశారు. వారి నుంచి నేరాలకు ఉపయోగించే ట్రాక్టర్ (ఇంజిన్), మోటార్ సైకిల్, రూ. 5 లక్షల విలువైన ట్రక్కులు, రూ.25 వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పెద్దాపురం కోర్టుకు తరలించగా సెప్టెంబర్ 12 వరకు రిమాండ్ విధించారన్నారు. గండేపల్లి మండలం తాళ్లూరు, మురారి, అనకాపల్లి జిల్లా నాతవరం, తూర్పుగోదావరి జిల్లా సమిశ్రగూడెంలో ట్రక్కులను వీరు దొంగిలించారు.

తండ్రిపై బీరు బాటిల్‌తో దాడి

నల్లజర్ల: మండల పరిధిలోని అనంతపల్లి శ్రీనివాస నగర్ కాలనీకి చెందిన కాకి సుబ్బారావు ఇటుకల వ్యాపారం చేస్తు జీవనం సాగిస్తున్నాడు. ఈ మేరకు శనివారం సాయంత్రం మద్యం కోసం దుకాణం వద్దకు వెళ్లగా అక్కడ స్నేహితులతో కలసి మద్యం సేవిస్తున్న తన కొడుకును మందలించాడు. ఈ నేపథ్యంలో ఆగ్రహించిన కొడుకు తండ్రిని బీరు బాటిల్‌తో దాడి చేసి మెడమీద పొడిచాడు. దాడిలో తీవ్రంగా గాయపడ్డ సుబ్బారావును రాజమండ్రి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అయినవిల్లి: మండలంలోని ఎస్.పెదపాలెంలో శుక్రవారం రాత్రి మోటార్ సైకిల్‌పై అమలాపురం నుంచి ముక్కామల వస్తున్న మోడేకుర్రుకు చెందిన చిలకలపూడి రవిచంద్రను ముక్కామల నుంచి అమలాపురం వెళ్తున్న మరో మోటార్‌సైకిలిస్టు అతి వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయాలపాలైన రవిచంద్రను అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. దీనిపై మృతుడి కుమారుడు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై హరికోటిశాస్త్రి తెలిపారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్



జాతీయ రహదారి పై నిలిచిపోయిన వాహనాలు

రాజానగరం: జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం సుమారు నాలుగు గంటల పాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 108 వంటి అత్యవసర సర్వీసులకు కూడా అవరోధం ఏర్పడింది. రాజానగరం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే మార్గంలో దివాన్ చెరువు వద్ద ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ఢీ కొన్న లారీ స్టీరింగ్ దెబ్బతినడంతో పక్కకు తీసేందుకు అవకాశం లేక వెనుక నుంచి వచ్చే వాహనాలకు ముందుకు వెళ్లలేక ఆగిపోయాయి. దివాన్ చెరువు నుంచి ఆదికవి నన్నయ యూనివర్సిటీ వరకు వాహనాలు నిలిపోయాయి. బొమ్మూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు నాలుగు గంటలకు పైగా సమయం పట్టింది.

తల్లి ఆస్తి కాజేసిన కుమారుడికి గుణపాఠం



సత్యవతికి గిఫ్ట్‌డీడ్ రద్దు కాపీని అందజేస్తున్న ఆర్డీఓ కృష్ణ నాయక్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సాక్షి సంతకం పేరుతో తల్లి ఆస్తి రాయించుకున్న కుమారుడికి అధికారులు గుణపాఠం చెప్పారు. ఆ గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేసి తిరిగి తల్లి పేరు మీద రాయించి ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. గోకవరం మండలం అచ్యుతాపేట గ్రామానికి చెందిన 72 ఏళ్ల రొబ్బి వెంకట సత్యవతికి ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆమెకు ఆ గ్రామంలో నాలుగు వాటాల పెంకుటిల్లు వారసత్వంగా వచ్చింది. ఆమె మూడో కుమారుడు లక్ష్మీ మధుసూదనరావు ఆ ఆస్తిని కాజేయాలని పథకం వేశాడు. తల్లికి మాయ మాటలు చెప్పి సాక్షి సంతకం పెట్టాలని నమ్మించి తన పేరు మీద 2017లో గిఫ్ట్ డీడ్ చేయించుకున్నాడు. ఆ తర్వాత ఈ విషయం తెలుసుకున్న సత్యవతి.. ఆర్డీఓ కృష్ణనాయక్‌ను ఆశ్రయించింది. దీంతో సీనియర్ సిటిజన్స్ యాక్ట్ – 2007 ప్రకారం విచారణ జరిపి, ఆ గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేస్తూ ఆర్డీవో ఉత్తర్వులు జారీ చేశారు. వాటిపై మధుసూదనరావు చేసుకున్న అప్పీల్‌ను కలెక్టర్ తిరస్కరించి, ఆర్డీఓ ఉత్తర్వులను అమలు చేయాలని ఆదేశించారు. దీంతో కోరుకొండ రిజిస్ట్రార్ ఆ గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేసి, ఆస్తిని మళ్లీ సత్యవతి పేరున రిజిస్టర్ చేశారు. ఆ డాక్యుమెంట్లను శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సత్యవతికి ఆర్డీఓ కృష్ణ నాయక్ అందజేశారు.

శ్రీనివాసా.. గోవిందా..

- వాడపల్లికి పోటెత్తిన భక్తులు
- ఒక్కరోజే రూ.66.21 లక్షల ఆదాయం



వాడపల్లి క్షేత్రంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



బ్యాటరీ కారులో ఎక్కుతున్న భక్తులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. అత్యధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో వేకువజాము నుంచే ఆలయంలో రద్దీ ఏర్పడింది. భక్తులు గౌతమీ గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేసి తలనీలాలు సమర్పించారు. క్యూ లైన్లలో గంటల తరబడి నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. ఏడు శనివారాల వెంకన్న దర్శనం నోము ఆచరించే భక్తులు మాడ వీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించి స్వామిని దర్శించుకున్నారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాసరావు, అర్చకులు, వేద పండితులు సుప్రభాత సేవతో ప్రారంభించి వివిధ సేవలు నిర్వహించారు. సుగంధ భరిత పుష్పాలతో స్వామివారిని విశేషంగా అలంకరించారు.

వైద్యశిబిరాలు

వాడపల్లి వెంకన్న క్షేత్రంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. పలువురు భక్తులు ఉపవాసాలతో నీరసపడి, స్వల్ప అస్వస్థతకు గురి కాగా డీసీ అండ్ ఈఓ చక్రధరరావు స్వయంగా వైద్య సేవలను పర్యవేక్షించారు. వారు కోలుకునే వరకు తగిన మందులు, టానిక్‌లు, ఓఆర్ఎస్‌లు ఇప్పించారు.

భారీగా ఆదాయం

వాడపల్లి దేవస్థానంలో స్వామివారి విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనం, వేదాశీర్వచనం, నిత్యాన్నదానం, శాశ్వత అన్నదానం, లడ్డూ ప్రసాదం విక్రయం తదితర సేవల ద్వారా రూ.66,21,466 ఆదాయం వచ్చినట్టు రాత్రి 8 గంటలకు డీసీ అండ్ ఈఓ చక్రధరరావు తెలిపారు. రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఆత్రేయపురం ఎస్సై ఎస్.రాము వాడపల్లిలో ట్రాఫిక్‌ను నియంత్రించి, బందోబస్తును పర్యవేక్షించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో ఏపీఎస్ ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు తిరిగాయి.

బ్యాటరీ కార్ల సౌకర్యం

తిరుమల తరహాలో వాడపల్లి వెంకన్న క్షేత్రంలోనూ వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులకు బ్యాటరీ కార్ల సౌకర్యం కల్పించారు. భక్తులకు సౌకర్యాలు మెరుగుపరిచేందుకు, తక్కువ సమయంలో దర్శనం కల్పించేందుకు డీసీ అండ్ ఈఓ చక్రధరరావు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ కార్లను ప్రవేశపెట్టారు. ఆత్రేయపురం మండలం మెర్లపాలెంకి చెందిన జేఎస్ఎన్ రాజు కన్‌స్ట్రక్షన్ కంపెనీ వారు దేవస్థానానికి రూ. 12 లక్షల వ్యయంతో 2 బ్యాటరీ కార్లు సమర్పించిన విషయం తెలిసిందే. కొత్త పార్కింగ్ ప్రాంతం నుంచి ఆలయం వరకూ నడవలేని భక్తులను బ్యాటరీ కార్లలో తీసుకువెళ్లి, మళ్లీ పార్కింగ్ స్థలం వద్ద దించుతున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకున్నారు.